క్లుప్తంగా

వెంకన్నకు విశేషంగా అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం అనంతరం ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు దేవస్థానం తరఫున ప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

సర్పంచ్‌ల సదస్సు నేడు

పరవాడ: ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమస్యల సాధన కోసం శనివారం నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘ అధ్యక్షురాలు చింతకాయల సుజాత ముత్యాలు ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి వై.ఎం.వి.ఏ కమ్యూనిటీ భవన సముదాయంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

500 కిలోల రేషన్ బియ్యం సీజ్



బియ్యం పట్టుకున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

సింహాచలం: పెందుర్తి పశువుల ఆస్పత్రి వద్ద ఉన్న ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 500కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సీజ్ చేశారు. కొందరి సమాచారం మేరకు ఆర్డీవో, పెందుర్తి తహసీల్దారు ఆనంద్‌కుమార్, సివిల్ సప్‌లై ఆర్‌ఐ కలిసి పరిశీలన జరిపారు. భూలోక అనే నిర్వాసితుడు ఇంట్లో 500 కిలోలు అక్రమంగా రేషన్ బియ్యం దొరకడంతో అతనిపై కేసు నమోదు చేశారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్



పెయింటింగ్స్ వేస్తున్న మహిళలు

సీతమ్మధార: బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ కొనసాగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాష్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. 14 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు అర్హులని డైరెక్టర్ యామిని తెలిపారు. మొదటి రోజు స్థానిక మహిళలు పాల్గొని పలు పెయింటింగ్స్ వేశారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా



ఎంపికైన విద్యార్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ మేళా జరిగింది. విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థ అయిన హెచ్‌సీఎల్‌లో టెక్ బీ ప్రవేశాలకు ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. జిల్లా నుంచి 75 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులుగా గుర్తించారు. 11మంది అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ మేనేజర్ అనీల్, క్లస్టర్ మేనేజర్ సాయి కిరణ్, ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ పాల్గొన్నారు.

సృజనకు పదును.. మెదడుకు మేత

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు



లఘు నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: కాస్త సమయం దొరికితే చాలు సెల్ ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారు పిల్లలు. చిన్నారుల ఆరోగ్యాన్ని, కాలాన్ని కూడా హరించే వాటికి దూరం చేయాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా కొత్త విషయాలను నేర్పించాలనే ఆసక్తి ఉన్నా, ఆర్థిక స్థోమత కారణంగా అటువైపు దృష్టి సారించలేకపోతున్నారు. ఆ లోటును భర్తీ చేస్తూ, వేసవి సెలవులను వినోదంతో పాటు విజ్ఞాన సముపార్జనకు వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వమే శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. నియోజకవర్గంలోని సబ్బవరం, పెందుర్తి, పరవాడ గ్రంథాలయాల్లో ఈ శిబిరాలు విజయవంతంగా సాగుతున్నాయి.

విద్యార్థుల ప్రతిభ వెలికితీసేలా

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను శిబిరాల్లో ప్రదర్శించే విధంగా శిక్షణ నిర్వహిస్తున్నారు. కథలు



హ్యాండ్ రైటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దలు చెప్పే కథలపై చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలను రోజూ నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి రిసోర్స్ పర్సన్లు కృషి చేస్తున్నారు. దినపత్రికల్లో వచ్చే కథలను చదివే చిన్నారులను ప్రోత్సహించడం, గణితం ఎలా నేర్చుకోవాలి, డ్రాయింగ్ వేసే పద్ధతులపై సూచనలు, ఎలా చదవాలి, చదివిన దాన్ని ఎలా గుర్తుపెట్టుకోవాలి తదితర అంశాలపై శిక్షణనిస్తున్నారు. అడవివరం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించినబుక్ రీడింగ్, కిట్టీ గేమ్స్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాలక్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కోరాడ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు పలు రకాల క్రీడల్లో పాల్గొని సత్తా చాటాలని తెలిపారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ చైర్మన్ బి.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు ఒక వరంగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన లఘునాటిక ప్రదర్శన చేయించారు.



యోగ విశిష్టత తెలియజేస్తున్న బి.బి.రాజేంద్ర ప్రసాద్

అలాగే యోగ సాధన చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, వక్త భాను, పాఠకులు కిరణ్, వరలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

సబ్బవరంలో..

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శుక్రవారం పుస్తక పఠనంతో పాటు హ్యాండ్ రైటింగ్‌లో మెలకువలు నేర్పించారు.చక్కని చేతిరాత ఎంతో అవసరమని గ్రంథాలయాధికారి శిరీష తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి తుది గడువు ఈ నెల 15



వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న చైర్మన్ రామారావు

పరవాడ: పీఎం కిసాన్, ఈకేవైసీ చేసుకోని రైతులు ఈ నెల 15వ తేదీలోగా నమోదు చేయించాలని మండల వ్యవసాయ సలహా సంఘ చైర్మన్ కోన రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకేవైసీ చేయించని రైతులకు నగదు పడదని రామారావు చెప్పారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చంద్రావతి కోరారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు చైర్మన్ రామారావు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు బండారు రాజశేఖర్, పోలిరెడ్డి అప్పారావు, కస్సూరి అయ్యబాబు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయండి



నాయుడుపాలెంలో రిపేర్లతో మూలుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. ఫలితంగా రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు, చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ బల్బులు మాత్రమే వెలుగుతున్నాయి. మోటార్లు, ఫ్యాన్లు, ఏసీలు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండాకాలం ఆపై విద్యుత్ సరఫరాలో అంతరాయంతో దోమలు, ఉక్కపోతతో రెండు రోజుల నుంచి కంటిమీద కునుకులేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. రెండు రోజులుగా మోటార్లు పనిచేయక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యమని ఆరోపిస్తున్నారు. మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని నాయుడుపాలెం గ్రామస్తులు కోరుతున్నారు.

15 రోజులకోసారి మండలస్థాయిలో స్పందన

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తి మండలంలో నెలలో రెండు శుక్రవారం రోజుల్లో స్పందన నిర్వహిస్తామని చెప్పారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు నెలలో రెండుసార్లు పదిహేను రోజులకోసారి విశాఖలోని ఆరు మండలాల్లో స్పందన నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో అధికారులు తీసుకున్న నిర్ణయాలకు అర్జీదారులు తృప్తి చెందకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయిలో స్పందన పెట్టడం ద్వారా క్లిష్టమైన సమస్యలు ఉన్నవాళ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాలేనివాళ్లు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహించడం వల్ల అధికారులు, వీఆర్‌వోలు సిబ్బంది అందుబాటులో ఉండి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.24 గంటల్లో సమస్య పరిష్కారం అవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. క్లిష్టమైన సమస్యలు సమయానుకూలంగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి పొందేలా సమస్య పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పెందుర్తి తహసీల్దారు ఆనంద్ కుమార్, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రతిభ పోటీలు

దాబాగార్డెన్స్: మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కళా ఉత్సవ్ పేరిట ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్టు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఆ రెండు రోజులు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్టుమెంటల్, డ్రాయింగ్, పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ, గెటప్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలో పాల్గొనదలచే వారు 9966485335, 9553333134 కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కనక మహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలచే భక్తులు 0891 – 2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పాల్గొన్న ఉభయదాతలు



అప్పన్న కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, అక్షింతలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఎన్‌టీ రామారావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకుని శనివారం ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు డి.భూపతిరాజు, ఎం.కృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ చేతుల మీదుగా తన నివాసంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ స్వరాంజలి, స్వరార్చన సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా.. జయమ్ము నిశ్చయమ్మురా.. పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫణిభూషణ్, మెలోడి సత్యనారాయణ, ఎంవీఆర్, నాగేశ్వరరావు, జ్యోతి, సత్యవతి, కల్యాణి, ధరణి, నిహారిక, ఉమాప్రియా తదితర గాయనీ గాయకులు ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలు ఆలపించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, విశాఖ సంగీత కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, స్వరమాధుర్యం అధ్యక్షుడు ఎంవీఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందించిన హృదయాలకు కృతజ్ఞతలు



కలెక్టర్ ఇచ్చిన చెక్కుతో మేయర్ హరి వెంకటకుమారి, బాలుడు కుటుంబ సభ్యులు

ఆరిలోవ: తక్షణ సాయంగా రూ.లక్షతో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హృద్రోగ బాధిత కుమారుడితో కుటుంబ సభ్యులు శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలిశారు. తమ ఆవేదనను ముఖ్యమంత్రికి వివరించేందుకు సహకరించిన మేయర్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. గురువారం అపోలో ఆస్పత్రిలో కార్యక్రమం ముగిసిన అనంతరం కాన్వాయ్ తిరిగి వెళ్తుండగా హృద్రోగ బాధిత బాలుడు వానపల్లి చరణ్‌సాయి మణికంఠను తీసుకొని తల్లి పార్వతి ముఖ్యమంత్రిని కలిసిన విషయం తెలిసిందే. బాలుడి పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఆమెకు వెంటనే తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. ఈ మేరకు జేసీ విశ్వనాథన్ రూరల్ తహసీల్దారు రమణయ్యతో కలసి అదేరోజు సాయంత్రం ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్‌లో ఉన్న పార్వతి ఇంటికి వెళ్లి తక్షణ సహాయం కింద రూ.లక్ష చెక్కు అందజేశారు. భవిష్యత్తులో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన కుమారుడి పరిస్థితి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి సహకరించిన మేయర్‌ను శుక్రవారం పెదగదిలిలో క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.

రాష్ట్రస్థాయిలో అగనంపూడి విద్యార్థుల ప్రతిభ

విజేతలకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: జీవన నైపుణ్యాలు పెంపొందించేలా జిల్లాలోని అగనంపూడి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు డి.నరేంద్ర, డి.జయంతి రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి విద్యార్థులే పరిష్కార మార్గాలు చూపేలా ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,700 ప్రాజెక్టులు రాగా, ఇందులో అగనంపూడి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గైడ్ టీచర్ పి. కృష్ణవేణిని, ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను వీఎంఆర్‌డీఏలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

'ఐయామ్ ఏ నర్స్' పాట విడుదల

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఎంఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అన్నీ ప్రేమజ ఆదిశర్ల రూపొందించిన 'ఐయామ్ ఏ నర్స్'పాట విడుదలైంది. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె ఈ పాటను విడుదల చేశారు. కేజీహెచ్‌లో 38 ఏళ్ల పాటు నర్సింగ్ వృత్తిలో కొనసాగి రెండేళ్ల కిందట నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన తన తల్లి ఎవాంజెలిన్ ఎస్తేర్‌కు ఈ పాటను అంకితం ఇస్తున్నట్లు ప్రేమజ తెలిపారు. ప్రతీ ఒక్కరి జీవితంలో నర్సుల పాత్రను తెలియజేస్తూ రూపొందించిన ఈ పాట అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు. ఈ పాటకు సాహిత్యం తానే అందించానని, సూరజ్ గిప్సన్ సంగీతం, మనోహర్, పీటర్ వీడియో ఎడిటర్లుగా సహకారం అందించారని చెప్పారు.

లలితా పీఠంలో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితా నగర్‌లోని లలితా పీఠంలో వైశాఖ మాసం బహుళ అష్టమి సందర్భంగా శనివారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి చేశారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. సాయంత్రం కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవకు మరో పేరు నర్సులు



కేక్ కట్ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్‌లో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులకు ఎవరూ సాటిరారన్నారు. అనంతరం కేక్ కట్ నర్సులకు పంచిపెట్టారు. రిటైర్ అయిన నర్సులు పి.సరోజని, బి.సీతలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సులు జయప్రద, వరలక్ష్మి, రాజకుమారి, పుష్ప, ఎల్.టి సుందరి సత్కరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెడ్ నర్సులు డి.లక్ష్మి, పి.వరలక్ష్మి, వి.ఉషారాణి, ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



సర్వాంగ వజ్రకవచధారుడిగా యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: సూర్యానగర్ జాతీయ రహదారిని ఆనుకుని వెలిసిన యోగ సిద్ధాంజనేయ స్వామి వారి ఆలయంలో శుక్రవారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శ్రీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో పూజలు నిర్వహించారు. మంగళధ్వని వేదమంత్రాలతో అర్చన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, ఋత్విక్వరుణ, మత్స్యంగ్రహణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, హోమాలు, అష్టోత్తర శతకలశారాధన, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. తొలి రోజున వజ్రకవచధారిగా యోగ సిద్ధాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రంగస్థల నటులు టీకే వీరభద్రాచారి, పసుమర్తి సన్యాసిరావు, సాహితీవేత్తలు సాలిపల్లి మంగామణి, వృద్దుల కల్యాణ రామారావు, పాత్రికేయులు ఆర్.శివకుమార్, గాయని పల్లా మనోరమ, సేవారంగంలో రాయపల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ అభిమాని బంటు అర్జునరావు, ప్రజా సేవా రంగంలో మోడేకుర్తి సత్యనారాయణ, కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజలకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.